
## కథావేదిక

మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ
చదువుకోవడం కోసం కథలన్నింటినీ
ఒకే గుత్తిగా అందిస్తున్నాం



# బుల్లితెరపై బుజ్జిబాబు...

-కె.వి.సుమలత

"బౌమ్మా...బామ్మా...బామ్మోయ్..బామ్మా... గావుకేకలు వేస్తున్నాడు బుజ్జిబాబు ఉరఫ్ వెంకట శివ నారాయణ.

ఇదేమీ పట్టనట్టుగా రామాయమ్మగారు దేవుడి గదిలో కూర్చుని పువ్వొత్తులు చేసుకుంటూ 'ఓం నమశ్శివాయ... ఓం నమశ్శివాయ' అంటూ శివ నామ స్మరణ చేసుకుంటోంది.

"నేనింతగా అరుస్తుంటే బదులు చెప్పవేంటి? అసలేం చేస్తున్నావు?" అంటూ లోపలకు వచ్చాడు. వత్తులు చేయడంలో లీనమైన బామ్మ తలెత్తకుండా కూర్చుంది.

విసురుగా లోపలకు అడుగు వేయబోయి కాళ్లకు షూస్ ఉండడంతో అక్కడే నిలబడి "ఇది ఇల్లనుకున్నావా? గానకచేరీ సభ అనుకుంటున్నావా? కర్ణకఠోరంగా పక్కింటి నుండి పాటలు వినిపిస్తున్నాయి. ఇంటర్వ్యూకి వెళ్దామని ప్రిపేరవుతుంటే చెవుల్లో ఇల్లు కట్టుకున్నట్లు ఒకటే రొద. ఇల్లుగలాయన నీకు పెత్తనం ఇచ్చాడు గదాని ఈ గోలని తీసుకువచ్చి పక్కన పెట్టావు. నేనసలు మా ఫ్రెండ్స్ ఉంటారు ఎవరికీ ఇవ్వవద్దని చెప్పాను. నా మాట వింటేగా?'' గయ్‌మంటూ బామ్మమీద లేచాడు.

"అయ్యో...అయ్యో! నెమ్మదిగా మాట్లాడు నాయనా! అవతల వింటారు. ఇప్పుడేం కొంపలంటుకున్నాయని అంతలా గొంతు చించుకుంటావు?'' అంది కాస్త విభూది చేతికంటించుకుంటూ.

బుజ్జిబాబు ఆ మాటలకు కోపంతో ముందుకు వెనక్కు వూగిపోయాడు. గది గుమ్మం పట్టుకుని తమాయించుకున్నాడు.

"కొంపలంటుకోవడం కాదు నా బుర్ర బద్దలయిపోతోంది ఆ పాట విను...''

'నాలోనే నువ్వు... నాతోనే నువ్వు... నేనంటే నువ్వు... నువ్వు...నువ్వు' అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా ఒక కోమలమైన స్వరం సన్నగా, తీయగా వినిపిస్తోంది.

"అబ్బా... ఎంత బాగా పాడుతోందిరా బుజ్జీ! ఈ పాట ఏం సినిమాలోదిరా? కొత్త సినిమానా, మాకాలంనాటిదా?'' అంటూ బుజ్జికేసి తిరిగింది బామ్మ.

బామ్మ ఆ పాటని చెవులు నిక్కబెట్టుకుని వినడమేగాక మెచ్చుకోవడం కూడా చూసేసరికి మరింత ఒళ్లు మండిపోయి మళ్లీ వూగిపోసాగాడు.

"అలా వూగితే పడిపోతావురా కన్నా... ఇలా వచ్చి దేవుడికి దండం పెట్టుకుని వెళ్లు. ఇంటర్వ్యూలో పాసవుతావు''

"నా ఖర్మ... నిన్ననుకుని ఏం లాభం? కాస్త వెళ్లి ఆ నువ్వు... నువ్వు...పీక నొక్కేయవే! నీకు పుణ్యముంటుంది. ప్రిపేరవకుండా వెళ్తే అన్యాయమవుతాను'' అన్నాడు.

చేస్తున్న వత్తులు ప్రక్కనున్న డబ్బాలో పెట్టి దాన్ని పక్కనున్న అల్మారాలో పెట్టి భుజం చుట్టూ ఉన్న చీరకొంగుని మరింత చుట్టుకుంటూ లేచింది.

బామ్మ ఆలస్యాన్ని సహించలేక, చేసేదిలేక చేతివేళ్ల గోళ్లు కొరకసాగాడు. సంతోషాన్ని, కోపాన్ని గోళ్లు కొరకడం ద్వారా తెలియజేస్తుంటాడతను.

ప్రక్కింట్లో సన్నజాజి గొంతు అంతకంతకూ పెరిగిపోతోంది. బామ్మ వెళ్లి ఆ పిల్లను కేకలు వేస్తుంటే వీనులవిందుగా విందామని ఆశగా ఎదురు చూస్తున్న బుజ్జిబాబుకి నిరాశే ఎదురయింది.

"అమ్మాయ్ శాంతా ఉన్నావటే...'' పిలుస్తూ వెళ్లింది బామ్మ.

"రండి...రండి అమ్మమ్మగారూ. అమ్మలేదు పేరంటానికి వెళ్లింది. కూర్చుందురుగాని రండి'' సన్నజాజి గొంతు వీణలా మీటింది.

"ఏంలేదమ్మ నీ గొంతు వినసొంపుగా ఉంది అమ్మడూ. చాలా బాగా పాడుతున్నావు. మళ్లీ పాడు ఒకసారి''

"నిజంగానా అమ్మమ్మగారూ... నా పాట అంత బాగుందా?'' ఆ పిల్ల గొంతులో వయ్యారాలు వినిపించి ఒళ్లు మండిపోయింది బుజ్జిబాబుకి.

"బామ్మా...బామ్మా...'' అరిచినంత పని చేసాడు.

"మా బుజ్జిబాబు పిలుస్తున్నాడే అమ్మడూ. నీ పాట మళ్లీ వింటాను. ఇంతకీ నీ పేరేంటో చెప్పావు కాదే?''

"లక్ష్మీప్రసన్న అమ్మమ్మగారూ. మీ బుజ్జిబాబు ఏం చదువుకుంటున్నాడు?''

"లక్షణమైన పేరు. చదువుకోవడం కాదే అమ్మడూ ఉద్యోగం వెతుక్కుంటున్నాడు. వస్తానే... వాడికి కోపం వస్తే మనిషి కాడు'' అంటూ వెనుదిరిగింది బామ్మ. కిసుక్కుమని నవ్వింది ఆ పిల్ల.

"నువ్వెందుకెళ్లావు అక్కడికి?'' కోపంగా అడిగాడు బుజ్జిబాబు.


"అదికాదురా బుజ్జీ...'' అంటూ ఏదో చెప్పబోయింది బామ్మ.

"ఎవరికైనా చెప్పినప్పుడయినా 'శివ' అని చెప్పవచ్చుగా... బుజ్జి ఏంటి బుజ్జి'' కందగడ్డలా ఉడుక్కున్నాడు .

"అదా నీ బాధ? ఎలా చెప్పగలనురా... మీ తాతగారి పేరు పెట్టుకున్నాము. చచ్చి ఎక్కడున్నారో మహానుభావుడు... ఆయన పేరు ఎలా పలుకగలనురా చోద్యం కాకపోతే?'' అని మూతిమీద వేలేసుకుంది బామ్మ.


"నిన్ననడం నాది బుద్ధితక్కువ. నాకు టైమయింది. నేను వెళ్తున్నాను'' అని విసురుగా బయటకు నడిచాడు.

"ఒరేయ్ బుజ్జీ... టిఫిన్ తినకుండా వెళ్తానంటావే? ఆగరా నాయనా...



## అందరిదీ విజయం

చాలాకాలంగా హిట్ కోసం ఎదురు చూస్తున్న బాలకృష్ణకు 'సింహ' విజయం సరికొత్త ఉత్సాహం ఇచ్చింది. 'ప్రేక్షకులకు ఏది కావాలో అవన్నీ ఈ చిత్రంలో పుష్కలంగా వున్నాయి. ఈ విజయం నా ఒక్కడివల్లే సాధ్యం కాలేదు. దర్శకుడు బోయపాటి శ్రీను, ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్, సంగీత దర్శకుడు చక్రి ఈ చిత్ర విజయంలో తమ వంతు పాత్రను అమోఘంగా పోషించారు. ఇందరి కృషివల్లే 'సింహ' సంచలన విజయం సాధించింది' అని బాలకృష్ణ తన సంతోషం వ్యక్తం చేసారు.



నా బంగారుతండ్రి కదూ! నాయనా... బుజ్జీ'' అంటూ బ్రతిమాలుతూ పిలిచింది.

"నీ బుజ్జిబాబు వెళ్లిపోతున్నాడా అమ్మమ్మగారూ'' అంటూ లక్ష్మీప్రసన్న అడుగుతోంది నవ్వుతూ.

బామ్మ పిలుపులు, లక్ష్మి కిలకిలరావాలు బుజ్జిబాబుకి వీధి మలుపు తిరిగేదాకా వినిపిస్తూనే ఉన్నాయి.

బుజ్జిబాబు గురించి చెప్పాలంటే కేశవశాస్త్రి, సుగుణమ్మల పదిహేను సంవత్సరాల కాపురం తరువాత ఎన్నో నోములు నోస్తే పుట్టిన గారాల పుత్రుడు. మరిక సంతానం లేకపోవడంతో కా అంటే కా, కీ అంటే కీగా అడిగిన కోర్కెలు తీర్చుకుంటూ బామ్మ ఒడిలో పెరిగి పెద్దవాడయ్యాడు. తల్లిదండ్రులకన్నా బామ్మ దగ్గర మాలిమి ఎక్కువ.

రామాపురంలో తాతలు కట్టించిన గుడిలో పౌరోహిత్యం చేసుకుంటూ ఊళ్లోవున్న పంట భూములు కౌలుకిచ్చి హాయిగా కాలం వెళ్లదీస్తున్న చీకు చింతా లేని కుటుంబం వారిది. పౌరోహిత్యం నేను చేయను, చదువుకుంటాను అని గొడవ చేసిన బుజ్జిబాబును దగ్గరగా వున్న కాకినాడలో ఇల్లు అద్దెకు తీసుకుని బామ్మను అతని దగ్గర ఉంచారు.

మకెందుకొచ్చిన ఉద్యోగాలు ఇంటికి వచ్చేయమన్న అమ్మానాన్నలతో 'ఉద్యోగం పురుష లక్షణం, నేను రాను' అని మొండికేసి ఉద్యోగాల వేటలో పడ్డాడు బుజ్జిబాబు.

నీరసంగా ముఖం వేలాడేసుకుని కాళ్లీడ్చుకుంటూ వచ్చిన బుజ్జిబాబుకి హాల్లోనే గానసభ ఎదురయింది. పాట పాడుతున్న పక్కింటి కోమలాంగి కళ్లు మూసుకుని ఆనందంతో మైమరచిపోతున్న బామ్మను చూసేసరికి కోపం వచ్చేసింది.

ఫైల్స్ ఒకప్రక్కకు విసిరేసి "బామ్మా...బామ్మా'' అంటూ చిందులు వేస్తూ పిలిచాడు.

"వీడి కేకలతో ఛస్తున్నానే అమ్మడూ... మళ్లీ రేపు వింటానే తల్లీ'' అంటూ లోపలకు వచ్చింది.

కోపంతో ఊగిపోతున్న బుజ్జిబాబు గోర్లు కొరికేసుకుంటూ ముందుకు వెనక్కు ఊగుతున్నాడు.

"అదేంట్రా బుజ్జీ... అదేదీ...బ్రేకో...షేకో అంటారే... అలా డేన్స్ చేస్తున్నావు. పడిపోతావేమోరా! పొద్దున్న తినకుండా వెళ్లిపోయావు. రా నీకిష్టమైన బూరెలు పెడతాను'' అంది బామ్మ.

బూరెల మాట వినగానే కోపం ఎగిరిపోయి బుజ్జి ముఖం బూరెలా పొంగింది.

"బాగా ఆకలేస్తోందే బామ్మా... త్వరగా పెట్టు మరి'' అంటూ గబగబా టేబుల్ మీదున్న డిష్ మూత తీసి చూసాడు. నిండుగా బూరెలున్నాయి. అంతే కుర్చీ లాక్కుని కూర్చుని ఒకటి తరువాత ఒకటి లాగించేసాడు.

బామ్మ పళ్లెం చేతిలో పట్టుకుని గుడ్లప్పగించి చూసింది.

"కొంచెం చేసావేంటే బామ్మా'' బ్రేవ్‌మని త్రేన్చుతూ అడిగాడు బుజ్జి.

"కొంచెమేంట్రా బడుద్దాయ్. నువ్వు తిన్నది డజను బూరెలు, అయినా అవి నేను చేయలేదురా. ప్రక్కింటి శాంత చేసి అదే లక్ష్మీప్రసన్నతో పంపింది. బాగున్నాయిట్రా అలా తిన్నావు?''

"ఛీ...ఛీ...అసలేం బాగాలేవు. నాకు ముందు ఎందుకు చెప్పలేదు'' అంటూ మళ్లీ చిందులు వేయాలని చూసాడు. కానీ పొట్ట సహకరించక మంచం కోసం వెతుక్కున్నాడు.

★★★

పట్టు వదలని విక్రమార్కుడిలా ఆఫీసుల చుట్టూ ఫైల్స్ పట్టుకుని బుజ్జిబాబు తిరుగుతున్నాడు. ఇంటర్వ్యూల పేరిట మెట్లెక్కడం, దిగడంతో విసిగిపోతున్నాడు. తెలిసిన వాళ్లెవరో ఆంజనేయస్వామికి పూజ చేస్తే అనుకున్న కోరిక నెరవేరుతుందని చెప్పడంతో స్వామి భక్తుడిగా మారిపోయాడు బుజ్జిబాబు.

బామ్మగారికి, పక్కింటి మనవరాలికి మంచి దోస్తీ కుదిరింది. బామ్మకు పనులలో చేదోడువాదోడుగా ఉండడం, ఖాళీ సమయంలో పురాణాలు చదివి వినిపించడం, అప్పుడప్పుడు లేటెస్టు పాటలు పాడడం, గుడికి, మార్కెట్‌కు తోడు వెళ్లడం...అంతెందుకు ఇద్దరూ ఒకటైపోయారు.

ఇదంతా బుజ్జిబాబుకి నచ్చడంలేదు. అసలు మొదటినుండీ లడ్డూలాంటి అమ్మాయికన్నా లడ్డూలమీదే భ్రాంతి ఎక్కువ.


దానికితోడు ఆంజనేయస్వామి భక్తుడిగా మారడంతో ఆడ గాలి పొడ గిట్టడంలేదు. కోపం రాకుండా ఉండడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుందన్నటు ఉన్నట్టుండి బామ్మకు బిపి



## సముద్రంలో మ్యూజియం

మెక్సికోలోని కేంకున్‌లోని రిసార్ట్స్ దగ్గర ఈ సంవత్సరాంతానికి సముద్రంలో ఒక మ్యూజియంను ఏర్పాటు చేయబోతున్నారట. ఎంతకాలమైనా సముద్ర లవణాల ప్రభావాన్ని తట్టుకునే శిలలతో 400పైగా శిల్పాలను రూపొందిస్తూ సహజమైన శిలాజాల నడుమ ఒక ఆకర్షణీయమైన మ్యూజియాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ప్రతి ఏటా కేంకున్‌కి వచ్చే 8 లక్షల మంది టూరిస్టులు ఈ మ్యూజియాన్ని సందర్శిస్తారని అనుకుంటున్నారు.

-తటవర్తి



డౌన్ అయి మంచమెక్కింది.

ఇక లక్ష్మీప్రసన్న బామ్మ కుడి భుజమల్లా ఏకంగా బామ్మ స్థానాన్నే తీసుకుంది. ఉదయం కాఫీ నుండి రాత్రి భోజనం వరకూ అన్నీ ఆ అమ్మాయే చేయడం భరించలేకపోయాడు.

బామ్మకు చెప్పి ప్రయోజనం లేదని ఊరినుండి అమ్మానాన్నలను పిలిపించాడు.


కోడలి సపర్యలతో బామ్మ తొందరగానే కోలుకుంది. సుగుణమ్మకు సన్నజాజి మొగ్గలాంటి లక్ష్మీప్రసన్న బాగా నచ్చేసింది. కలివిడిగా మాట్లాడుతూ ఇంట్లో కలసిపోయిన ఆ అమ్మాయిని బుజ్జిబాబుకిచ్చి పెళ్లిచేస్తే ఎలా ఉంటుందని బామ్మను సంప్రదించింది.

కోడలి మాటలకు ఆనందంతో ఉప్పొంగిపోయి తానా అంటే తందానా అని తల వూపేసింది. అనుకున్నదే తడవుగా లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులకు తమ మనసులో మాట చెప్పారు.



## ప్రచారానికి దూరం

త్రిష, ఇలియానా, కాజల్, జెనీలియా... వీళ్లందరూ అటు సినిమాల్లోనే కాదు, ఇటు యాడ్స్ ద్వారా కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. వీళ్లందరితో పోలిస్తే నయనతార ఈరకమైన యాడ్స్‌కూ దూరంగానే వుందని చెప్పవచ్చు. ఈమధ్య ఒక ప్రముఖ నగల దుకాణం వారు తమ ప్రొడక్ట్స్‌కు ప్రచారం చేయవలసిందని నయనతారను కోరినప్పుడు 'నాకు యాడ్స్‌లో నటించడం అంతగా ఇష్టముండదు' అంటూ సున్నితంగా వారి ఆఫర్‌ను తిరస్కరించిందిట. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో హీరోయిన్లు రెండు చేతుల్తో ఎడాపెడా సంపాదిస్తున్న ఈ రోజుల్లో నయనతార తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యంగా వుందికదూ!




సంప్రదాయమైన కుటుంబం, కుర్రవాడు బుద్ధిమంతుడు, స్థితిమంతుడు కావడంతో వారు అభ్యంతరం చెప్పలేదు.

"ఏమే పిల్లా! మా మనవడిని చేసుకుంటావా?" అని అడిగిన బామ్మ మాటలకు "పొండి అమ్మమ్మగారూ" అంటూ సిగ్గుతో మెలికలు తిరిగి తన అంగీకారాన్ని తెలిపింది లక్ష్మీప్రసన్న.

చివరగా బుజ్జిబాబుతో నీ పెళ్లి పక్కింటి అమ్మాయితో చేద్దామనుకుంటున్నాము అని కేశవశాస్త్రి చెప్పాడు.

"ఎవరినడిగి ఈ నిర్ణయం తీసుకున్నారు? నేనసలు పెళ్లే చేసుకోను. ఉద్యోగం దొరక్క నేనేడుస్తుంటే ఇప్పుడు నాకు పెళ్లి తక్కువయిందా? నాకసలు పెళ్లి వద్దే వద్దు" అంటూ యధావిధిగా గోళ్లు కొరుక్కుంటూ బ్రేక్ డాన్స్ చేసాడు బుజ్జిబాబు.

కొడుకుచేసే తలంటుస్నానాలు, పూజలు గమనిస్తున్న సుగుణమ్మ ఊరుకోలేదు.

"లక్షణంగా అన్నివిధాలా మనకు సరిపోయిన పిల్ల వెతక్కుండానే దొరికితే కాదంటావేంట్రా? నీకిప్పుడు ఉద్యోగం దొరక్కపోతే వచ్చిన నష్టంలేదు. నీ చాదస్తాలు కట్టిపెట్టు. నీకిక నెలరోజులు టైమిస్తున్నాము. ఒప్పుకోకపోతే మేము నుయ్యోగొయ్యో చూసుకుంటాము" అని బుజ్జిబాబు అంత కాకపోయినా కొంత డాన్సుచేసింది.

అది చూసి బామ్మ కంగారుపడి కోడలిని ఆపింది. అత్తగారు పట్టుకోవడంతో స్టెప్పులు ఆపి నిలబడింది సుగుణమ్మ. తరువాత సుగుణమ్మ వాళ్లు వూరు వెళ్లిపోయారు.

★★★

ఒకరోజు బుజ్జిబాబు ఇంటికి వచ్చేసరికి చీకటి పడిపోయింది. ఇంటికి తాళం వేసి ఉంది.

బామ్మ ఎక్కడికి వెళ్లిందో అని తిట్టుకుంటూ గేటు దగ్గరే చతికిలబడ్డాడు.

"ఎంతసేపయింది మీరు వచ్చి? ఇంతసేపు మీరు వస్తారని చూసి ఇప్పుడే లోపలకు వెళ్లాను" కిలకిలరావం మల్లెపూల వాసన కలగలిపి బుజ్జిబాబుకి వినిపించింది.

తెలుపు లంగాకు ఎరుపు బార్డర్, ఎరుపు జాకెట్టు, తెలుపు ఓణీతో తలనిండా పూలు పెట్టుకుని పక్కింటి కోమలాంగి చేతిలో తాళం చెవితో నిలబడి వుంది.

బుజ్జిబాబుకి ఒక్క క్షణం గుండె లయ తప్పినట్లయింది. ఆమె తాళం చెవి కళ్లముందు వూపింది. గబుక్కున అది అందుకుని గేటుకేసి తిరిగి తాళం తియ్యసాగాడు.

"అమ్మమ్మగారు, మా అమ్మగారు పురాణ కాలక్షేపానికి శివాలయానికి వెళ్లారు. కాఫీ ఫ్లాస్కులో పోసి పెట్టానని చెప్పమన్నారు" అడగకపోయినా సన్నజాజి చిలకలా పలికింది.

బుజ్జిబాబు గేటు తాళం తీసుకుని గుండె చెదరకుండా గట్టిగా పట్టుకుని ఆంజనేయస్వామి జపం చేయసాగాడు దేవుడి ముందు కూర్చుని.

బామ్మ ఇంటికి వచ్చేసరికి బుజ్జిబాబు నేలమీద కూర్చుని దీక్షగా ఆంజనేయస్వామి వంక చూస్తున్నాడు ఈ ప్రపంచంతో సంబంధం లేనట్లుగా.

"బుజ్జీ! ఎంతసేపయిందిరా వచ్చి? కాఫీ త్రాగలేదా" అంటూ కాఫీ గ్లాసులో పోసుకొచ్చి గ్లాసు చేతికిచ్చింది.

మౌనంగా గ్లాసు అందుకుని ఆంజనేయస్వామికి చూపించి అప్పుడు తాగడం మొదలుపెట్టాడు.

'వీడికి పిచ్చి ముదిరి పాకాన పడినట్లుంది' అనుకుని "నీకు ఉద్యోగం రావడానికి ఎన్నిరోజులు పడుతుంది?' అని అడిగింది.

"ఏమో మరి? అప్లై చేసాను. మౌఖిక ఇంటర్వ్యూకు అటెండ్ అయ్యాను బామ్మా. మరో నాలుగురోజుల్లో రావచ్చు" నమ్మకంగా చెప్పాడు.

"ఆ పిల్ల అదృష్టంవల్ల ఉద్యోగం వచ్చేస్తే ఈ నెలలోనే నీతో మూడు ముళ్లు వేయించుకుంటుంది. అసలు దాని ముఖాన లక్ష్మీకళ తాండవిస్తోం దిరా. చిదిమి దీపం పెట్టవచ్చు."

"బామ్మా... ఆపుతావా?" అంటూ కూర్చునే ముందుకు వెనక్కి అసహ నంగా ఊగిపోతున్నాడు.

"మీ అమ్మ పెట్టిన టైము గుర్తుందిగా" అంటూ బామ్మ అక్కడి నుండి వెళ్లిపోయింది.

★★★

రెండురోజుల తరువాత "నాకు ఉద్యోగం వచ్చేసిందోచ్" అంటూ ఆనందంగా బామ్మను గిరగిరా తిప్పేసాడు బుజ్జిబాబు.

"పడిపోతానురా బుజ్జీ... ఆగరా" అంటూ అరుస్తున్నా ఆపలేదు.

"నేను చాలా ఆనందంగా ఉన్నాను. నన్ను క్షమించవే బామ్మా" అంటూ బామ్మను మంచంమీదకు చేర్చాడు.

"ఓరి నీ అసాధ్యం కూలా...చంపావుకదరా నన్ను" అని తిట్టుకుంది బామ్మ.

"అర్జంటుగా లక్షన్నర రూపాయలు బ్యాంకులో కట్టాలే బామ్మా. నాన్న గారితో మాట్లాడాలి. టైము లేదు. రేపు జాయినయిపోవాలి" అంటూ బయ టకు పరుగెత్తాడు.

బుజ్జి అన్నట్లుగానే లక్షన్నర రూపాయలు న్యూ మోడరన్ బ్యాంక్, గాంధీనగర్ శాఖలోని ఖాతాలో జమ చేసాడు.

★★★

మరుసటిరోజు ఉదయం కొత్త డ్రెస్ వేసుకుని నీట్‌గా టక్ చేసుకుని, షూస్ వేసుకుని చేతిలో ఫైల్‌తో ఆఫీసుకు బయలుదేరాడు. వెళ్లేముందు పలుమార్లు దేవుడి ముందు పడుకుని లేచి నిలబడి దండాలు పెట్టుకుని హనుమాన్ చాలీసా చదువుకున్నాడు.

బామ్మ అదంతా చూసి "పిచ్చి నాగన్నా! వీడినిలా వదిలితే తొందరలోనే సన్యాసుల్లో కలుస్తాడు. ఇంక జాప్యం చేయకూడదు" అని తీవ్ర నిర్ణయం తీసుకుంది.


సుమారు పదకొండు గంటల సమయంలో లక్ష్మీప్రసన్న బామ్మ దగ్గ రకు పరుగెత్తుకుంటూ వచ్చింది.

"ఇలా రండి అమ్మమ్మగారూ" అంటూ టీవీ దగ్గరకు తీసుకెళ్లి న్యూస్ ఛానల్ పెట్టింది.

"ప్రముఖ కంపెనీల పేర్లతో ఉద్యోగాలు ఇస్తామని యువతీ యువకు లకు ఫోన్లు చేసి భారీగా నిధులు దండుకున్న ముగ్గురు మోసగాళ్లను సిఐడి సైబర్ విభాగం పోలీసులు అరెస్టు చేసారు. ఈ నిందితులు స్కిల్ బ్యాంక్ కన్సెల్టెన్సీ, హెచ్‌ఆర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆర్.కిరణ్‌కుమార్ పేరుతో కొందరు నిరుద్యోగులకు ఫోన్లు చేసేవారు. సెల్‌ఫోనులో మౌఖిక ఇంటర్ వ్యూలు నిర్వహించి కొందరికి ఇంటర్‌నెట్ ద్వారా నియామక పత్రాలు అందజేసారు. ఇందుకుగాను సుమారు లక్షన్నర రూపాయలు హైదరాబా ద్‌లోని న్యూ మోడరన్ బ్యాంక్, గాంధీనగర్ శాఖలోని ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఇంటెల్ గ్రూప్, 5వ ఫ్లోర్, మాదాపూర్, కాకినాడ లోని కార్యాలయంలో విధుల్లో చేరాలని పేర్కొంటున్న నియామక పత్రాన్ని తీసుకుని ఆ ఉద్యోగం పొందినవారు అక్కడకు వెళ్లగా కంపెనీ సిబ్బంది నివ్వెరపోయారు. తామెలాంటి ఇంటర్వ్యూలు నిర్వహించలేదనీ, కాల్ లెటర్లు పంపలేదనీ తెలపడంతో అభ్యర్థులు అవాక్కయ్యారు. అయితే నియామక పత్రాలు అచ్చం వారి కంపెనీకి చెందినవాటిలాగానే ఉండడం విశేషం. తాము మోసపోయిన విషయం గుర్తించిన బాధితుల వేదన వర్ణనా తీతం" అంటూ చూపించిన క్లిప్పింగులనే మళ్లీ మళ్లీ చూపిస్తున్నారు.

ఫైలు చంకలో పెట్టుకుని కుడి చేతి గోర్లు, ఎడమచేతి గోర్లు మార్చి మార్చి కొరుకుతున్న బుజ్జిబాబుని చూస్తూ బామ్మ "మా నాయనే...! టీవీలో ఎంత చక్కగా ఉన్నాడో! మోసపోతే పోయాడుగానీ" అంటోంది మురిపెంగా.

★



## సోలార్ పవర్

ఆఫ్రికాలో ఎంత ఎడారి ఉందంటే అక్కడ జ్వలించే సూర్యరశ్మితో జనించిన సోలార్ పవర్‌తో ఆఫ్రికాలోని యావన్మంది 60 కోట్ల జనాభాకి, కొంత ఐరోపా ఖండ వాసులకు అవసరమైన విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవ చ్చునట. అది ఒక చదరపు కిలోమీటరు స్థలంలో దొరికే ఒకటిన్నర బేరల్స్ పెట్రోలియం నూనెకి సమతూకమట. అయితే భూమిలో ఏదో ఒకనాటికి పెట్రోలియమ్ అడుగంటిపోతుంది కానీ భూమిపై కురిసే సూర్యరశ్మికి అంతమంటూ ఉండదు కదా!

-తటవర్తి

